సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 5 । జూన్ । 2024



ఎండల్లో హాయ్ హాయ్
ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నారులు ఈత బాట పడుతున్నారు. స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకుంటూ ఆస్వాదిస్తున్నారు. 2లో ▸



అంజన్న తెప్పోత్సవం
గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో హనుమద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి తెప్పోత్సవం నిర్వహించారు. 2లో ▸



పశుగ్రాసం కొరత
గ్రామాల్లో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దాళ్వాసాగులో కోతలకు యంత్రాలను వినియోగించడం కారణంగా కనిపిస్తోంది. 2లో ▸

న్యూస్‌రీల్

భీమవరంలో చెస్ టోర్నీ



చెస్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో మంగళవారం అంతర్జాతీయ చెస్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్ ప్రారంభమైంది. అనసూయ చెస్ అకాడమీ, కాస్మోస్పోర్ట్స్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ చెస్ సమాఖ్య, అఖిల భారత చెస్ సమాఖ్య, జిల్లా చెస్ సమాఖ్య సహకారంతో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌ను కాస్మో క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు ప్రారంభించిమాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాబోయే కాలంలో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ టోర్నమెంట్‌కు 15 రాష్ట్రాలకు చెందిన 273 మంది చెస్ క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.రామరాజు, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు, తటవర్తి నవీన్, గమిని పవన్, తోట హరిబాబు, పరుచూరి నాగేశ్వరరావు, మురళీమోహన్, ఎ.ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఫలితాలు విడుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గతేడాది డిసెంబర్ 3వ తేదీన నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయని, వివరాలు బీఎస్‌ఈ ఏపీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులు త్వరలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి సంబంధిత ఉప విద్యాశాఖాధికార్లకు పంపిస్తామన్నారు. పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ నియమాల ప్రకారం వెంటనే ఏదైనా జాతీయ బ్యాంక్‌లో విద్యార్థి పేరున సేవింగ్స్ ఖాతా తీసుకుని తండ్రి లేదా తల్లిని జాయింట్ చేసుకుని విద్యార్థి ఆధార్ నంబర్‌ను మాత్రమే అకౌంట్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. ఎంపికైన విద్యార్థుల కోసం త్వరలో జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ తెరుస్తుందని, ఆ సమయంలో ప్రతి విద్యార్థి నమోదు చేసుకోవడానికి గాను విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, మెరిట్ లిస్ట్‌లో ఉన్న విధంగానే ఆధార్ కార్డులోనూ, బ్యాంక్ పాస్‌బుక్‌లోనూ ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.

నరసాపురం ఎంపీ వర్మకు అభినందనలు



ఎంపీగా గెలుపొందిన శ్రీనివాసవర్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు

ఏలూరు (టూటౌన్): నరసాపురం నుంచి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన భూపతిరాజు శ్రీనివాస వర్మకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నరసాపురం పార్లమెంట్ ఎన్నికల బీజేపీ ఇన్‌చార్జి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అభినందనలు తెలిపారు. ఎన్నికల ఫలితం వెలువడిన వెంటనే భీమవరంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద భూపతిరాజు శ్రీనివాసవర్మకు గారపాటి చౌదరి పుష్పగుచ్ఛం అందజేశారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాల్సిందిగా కోరారు.

ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

యలమంచిలి: దాళ్వా పంటకు సంబంధించి ధాన్యం కొనుగోలు 80 శాతం పూర్తయినట్లు మండల వ్యవసాయాధికారి శింగలూరి దేవి చెప్పారు. యలమంచిలి మండలంలో ఈ ఏడాది దాళ్వా పంటకు సంబంధించి 5,513 ఎకరాలలో వరి సాగు చేశారన్నారు. 18,331 టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారన్నారు. ఇప్పటివరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా 14,458 టన్నుల ధాన్యం సేకరించినట్లు ఆమె చెప్పారు. మిగిలిన ధాన్యానికి అవసరమైన గోనె సంచులు రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్నాయన్నారు. సార్వా సాగు చేసే రైతులు విత్తనాలు, ఎరువుల కోసం రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.



నరసాపురం ఎంపీ అభ్యర్థిగా విజయం సాధించిన భూపతిరాజు శ్రీనివాసవర్మకు సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్



పితాని సత్యనారాయణ, ఆచంట టీడీపీ అభ్యర్థి




కనుమూరి రఘురామకృష్ణరాజు ఉండి టీడీపీ అభ్యర్థి




ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు టీడీపీ అభ్యర్థి



నిమ్మల రామానాయుడు పాలకొల్లు టీడీపీ అభ్యర్థి



పులపర్తి రామాంజనేయులు భీమవరం జనసేన అభ్యర్థి



బొలిశెట్టి శ్రీనివాస్ తాడేపల్లిగూడెం జనసేన అభ్యర్థి



బొమ్మిడి నాయకర్ నరసాపురం జనసేన అభ్యర్థి

కూటమిదే విజయం

- నరసాపురం ఎంపీ స్థానం బీజేపీ కైవసం
- టీడీపీ నాలుగు, జనసేన మూడు అసెంబ్లీ స్థానాల్లో గెలుపు
- కట్టుదిట్టమైన భద్రత మధ్య ఓట్ల లెక్కింపు
- ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్

సాక్షి, భీమవరం/ పాలకొల్లు సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమగోదావరి జిల్లాలో కూటమి విజయం సాధించింది. నరసాపురం ఎంపీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోగా టీడీపీ నాలుగు, జనసేన పార్టీ మూడు అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందాయి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు నడుమ కౌంటింగ్ నిర్వహించారు. జిల్లాలోని ఆచంట, నరసాపురం, పాలకొల్లు, తణుకు నియోజకవర్గాలకు భీమవరంలోని విష్ణు కళాశాలలో, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గాను 5 గంటల సమయం నుంచి కౌంటింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవడం కనిపించింది. 6 నుంచి 7 గంటల సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు కేంద్రాలకు చేరుకున్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లను జువ్వలపాలెం, తాడేపల్లిగూడెం రోడ్లలోని కౌంటింగ్ కేంద్రాల వరకు పోలీసులు మూడు చోట్ల తనిఖీలు నిర్వహించి కేంద్రాల్లోకి అనుమతించారు. వారు వచ్చిన వాహనాలను రెండు కేంద్రాలకు కిలోమీటరు దూరంలోనే సిద్ధం చేసిన ప్రదేశాల వద్ద పార్కింగ్ చేయించి అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో వారిని కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు.

బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు ప్రారంభం

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం విష్ణు కళాశాలలోని లైబ్రరీ రీడింగ్ రూమ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన హాల్‌లో ఉదయం 8 గంటలకు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లు లెక్కింపు ప్రారంభించారు. అనంతరం ఈవీఎంల ఓట్లు లెక్కింపు ప్రారంభించారు. అంతకు ముందు రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ సీళ్లను తొలగించి తాళాలను తీసి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌కు తీసుకువచ్చారు. కొద్దిసేపటికే ఈవీఎంల ఓట్లు లెక్కింపు మొదలైంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ రెండు కౌంటింగ్ కేంద్రాల వద్ద కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ, అధికారులకు అవసరమైన ఆదేశాలిస్తూ వచ్చారు. జేసీ ప్రవీణ్ ఆదిత్య కౌంటింగ్‌ను పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో తొలుత నరసాపురం ఫలితం వెల్లడి కాగా అనంతరం ఆచంట, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తర్వాత భీమవరం, తణుకు, ఉండి ఫలితాలు వెలువడ్డాయి. విజేతలకు రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

● ఆచంట

టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ 26,554 ఓట్లతో గెలుపొందారు. ఆయనకు 85,402 ఓట్లు పోలవ్వగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు 58,848 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి నెక్కంటి వెంకట సత్యనారాయణకు 1,872 ఓట్లు, బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థి అల్లూరి చిన్నారావుకు 1,543, జనతా చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థి అల్లాడి సూర్యభాస్కరరావుకు 275, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి వేళంగి శ్రీనివాసరెడ్డికి 270, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థి కాకి శ్యామ్‌కుమార్ 215, స్వతంత్ర అభ్యర్థులు సికిలే రత్నరాజుకు 293, రామోజు పూర్ణచంద్రశేఖర్‌కు 150, నోటాకు 1,673 ఓట్లు పోలయ్యాయి.

● నరసాపురం

జనసేన పార్టీ అభ్యర్థి బొమ్మిడి నారాయణ నాయకర్ సమీప వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజుపై 49,738 ఓట్లతో గెలుపొందారు. నాయకర్‌కు 94,116 ఓట్లు పోలవ్వగా ప్రసాదరాజుకు 44,378, కాంగ్రెస్ అభ్యర్థి కానూరి ఉదయ భాస్కర కృష్ణప్రసాద్‌కు 1,915, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొల్లి సత్యనాయకర్‌కు 1,172, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి ఆకుల వెంకటస్వామికి 540, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి బుర్రా రామకృష్ణకు 425, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి బందెల రాజేంద్రప్రసాద్‌కు 420, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థి పోతురాజు యాకోబ్‌కు 372, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి పాలెపు సత్యలింగ నాయకర్‌కు 373, స్వతంత్ర అభ్యర్థులు కంచన వెంకటరమేష్‌కు 295, గాడి రవికి 226 ఓట్లు, నోటాకు 1,216 ఓట్లు పోలయ్యాయి.

● పాలకొల్లు

పాలకొల్లులో టీడీపీ అభ్యర్థి నిమ్మల రామానాయుడు 67,945 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆయనకు 1,13,114 ఓట్లు పోలవ్వగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావుకు 45,169 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలుకులూరి అర్జునరావుకు 1945, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి ఏలియా కొల్లాబత్తులకు 473, పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి పోలిశెట్టి శివకృష్ణకు 272, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి బెజవాడ తులసీరావుకు 120, స్వతంత్ర అభ్యర్థులు పాలపర్తి జన్సన్‌కు 422, సలాది శ్రీరామమూర్తికి 260, వసంతాల డీవీ సురేష్‌కు 137, నల్లి రాజేష్‌కు 75, జల్లా వాసుకు 68, తానేటి ప్రసాద్‌కు 66, అనంతనాగభూషణం తమ్మాకు 64, కొటికలపూడి ప్రదీప్‌కు 64, తానేటి చిన్నబ్బులుకు 45, నోటాకు 919 ఓట్లు పోలయ్యాయి.

● తణుకు

టీడీపీ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ 72,121 ఓట్లు ఆధిక్యతతో గెలుపొందారు. ఆయనకు 1,29,547 ఓట్లు పోలవ్వగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావుకు 57,426 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి కడలి రామారావుకు 2,422, బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థి ఆకుమర్తి ధనుంజయకు 1,427, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థి శాఖా సురేష్‌కు 378, స్వతంత్ర అభ్యర్థులు కరుటూరి సుబ్బారావుకు 901, రామచంద్రరావు కూసంపూడికి 216, మురళీకృష్ణ సజ్జాకు 173, కోడూరి మెహర్ చైతన్యకు 162, రాపేటి రమణబాబుకు 149, మామిడిశెట్టి మోహన్‌ఆజీకి 95, కుమారి పువ్వలకు 90, చిట్టూరి సత్యనారాయణకు 60, నోటాకు 1,722 ఓట్లు వచ్చాయి.

● తాడేపల్లిగూడెం

జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ 62,492 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బొలిశెట్టికి 1,16,443 ఓట్లు పోలవ్వగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణకు 53,951 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి మార్నీడి శేఖర్‌కు 1,901, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి పీఎస్‌ఆర్ కృష్ణకు 919, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాసరావుకు 752, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మరపట్ల రాజుకు 740, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి బూసనబోయిన ఆంజనేయులుకు 506, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి మేకా వెంకటేశ్వరరావుకు 203, స్వతంత్ర అభ్యర్థులు బి. రాజేష్‌కు 263, ఉంగరాల పద్మకు 254, సిరివరపు సింహాచలంకు 238, లంక ప్రసాద్‌కు 188, నడపన అచ్యుతకుమార్‌కు 157, నోటాకు 1,534 ఓట్లు వచ్చాయి.

● ఉండి

టీడీపీ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు 56,777 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. ఆయనకు 1,16,902 ఓట్లు పోలవ్వగా సమీప వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెనుమత్స వెంకట లక్ష్మీనరసింహ రాజుకు 60,125 ఓట్లు పోలయ్యాయి. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి వీవీ శివరామరాజుకు 13,260, కాంగ్రెస్ అభ్యర్థి వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజుకు 1,157, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి మల్లిపూడి షర్మిలకు 1,140, నీతి నిజాయితీ పార్టీ అభ్యర్థి పి.శివరామరాజుకు 169, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి అల్లూరి సతీష్‌చంద్ర కుమార్‌కు 114, అఖిల భారత జనసంఘ్ అభ్యర్థి ఎం.రవివర్మకు 111, నేషనల్ జనశక్తి పార్టీ అభ్యర్థి కడియం సూరిబాబుకు 95, స్వతంత్ర అభ్యర్థులు దండు సతీష్‌రాజుకు 381, గాజుల శివకు 185, దిడ్ల ప్రేమ్‌కుమార్‌కు 117, కూనపురాజు వెంకటకృష్ణంరాజుకు 109, నోటాకు 1,607 ఓట్లు వచ్చాయి.

● భీమవరం

జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు 66,974 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. పులపర్తికి 1,30,424 ఓట్లు రాగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌కు 63,450 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి అంకెం సీతారామ్‌కు 3,252, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పేరిచర్ల రామాంజనేయులుకు 1,503, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి బూజీ రాచెర్లకు 1,037, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి కడియం రామాంజనేయులుకు 636, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థి బళ్వాని పవన్‌కుమార్‌కు 575, భారత్ చైతన్య యువజన పార్టీ అభ్యర్థి పేపేటి వడ్డికాసులుకు 272, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి అల్లూరి శ్రీనివాసరాజుకు 270, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి దండు శ్రీనివాసరాజుకు 221, స్వతంత్ర అభ్యర్థులు ఏడుకొండలుకు 388, మండవ నాగేశ్వరరావుకు 240, పెంటపాటి మెహర్ మనోహర్‌కు 231, గుగ్గిలపు రామకృష్ణకు 143, చామకూరి కుసుమకుమారి పద్మావతికి 131, నోటాకు 1210 ఓట్లు పోలయ్యాయి.



భీమవరంలో కౌంటింగ్‌ను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌ను తెరుస్తున్న దృశ్యం



విష్ణు కళాశాలలోని కౌంటింగ్ హాల్‌లో సందడి

నరసాపురం.. బీజేపీ సొంతం

నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన భూపతిరాజు శ్రీనివాసవర్మ 2,76,802 ఓట్లు ఆధిక్యతతో గెలుపొందారు. భూపతిరాజు శ్రీనివాసవర్మకు 7,07,343 ఓట్లు పోలవ్వగా వైఎస్సార్‌సీపీ నుంచి నరసాపురం చరిత్రలో తొలి బీసీ మహిళ అభ్యర్థిగా పోటీ చేసిన గూడూరి ఉమాబాలకు 4,30,541 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి కేబీఆర్ నాయుడుకు 35,213, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి సిర్రా రాజుకు 6,014, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థి ఓలేటి నాగేంద్రకృష్ణకు 3,116, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి గంజి పూర్ణిమకు 1,649, స్వతంత్ర అభ్యర్థులు ఉందుర్తి ప్రసన్నకుమార్‌కు 6,364, మేడపాటి వెంకటవరహాల రెడ్డికి 5,969, బలగం నాయకర్‌కు 5,240, నల్లి రాజేష్‌కు 4,684, కేతా శ్రీనుకు 3,145, అద్దేపల్లి వీరవెంకట సుబ్బారావుకు 2,783, జాస్తి ఆనంద్ చందులాల్‌కు 2,726, గేదెల లక్ష్మణరావుకు 1,527, అద్దంకి దొరబాబుకు 1,393, గొట్టుముక్కల శివాజీకి 1,384, దుప్పనపూడి ఆదినారాయణకు 1,007, మన్నే లీలారామ నరేంద్రకు 930, తోలేటి రామదుర్గాప్రసాద్‌కు 920, రుక్మిణికి 686, అడబాల శివకు 683, నోటాకు 7,677 ఓట్లు వచ్చాయి.



భీమవరం విష్ణు కళాశాల వద్ద కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లను తనిఖీ చేసి పంపిస్తున్న పోలీసులు



బ్యాలెట్ బాక్స్ సీలు తీస్తున్న సిబ్బంది



కౌంటింగ్ హాల్‌లోకి బ్యాలెట్ బాక్సులు తీసుకువస్తున్న దృశ్యం

ఏలూరు.. అదే జోరు

- ఏలూరు ఎంపీగా పుట్టా మహేష్ యాదవ్ గెలుపు
- నాలుగు స్థానాల్లో టీడీపీ గెలుపు
- రెండు స్థానాల్లో జనసేన అభ్యర్థుల విజయం
- ఒక స్థానం బీజేపీ అభ్యర్థి కైవసం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం జరిగింది. ఏలూరు ఎంపీగా టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ గెలుపొందగా, 7 అసెంబ్లీ నియోజకవర్గాలను కూటమిలో మిత్రపక్షాలు కైవసం చేసుకున్నాయి. అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు మెజార్టీలతో పోలిస్తే ఎంపీ అభ్యర్థికి కొంత తగ్గింది. ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లల్లో క్రాస్ ఓటింగ్ భారీగా జరిగింది. జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ నేతృత్వంలో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగింది.

ఉదయం 8 గంటలకు..

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏలూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగింది. 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 7 హాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో హాలులో 14 టేబుళ్ల అసెంబ్లీకి, 14 టేబుళ్ల పార్లమెంట్‌కు కేటాయించి మొత్తంగా 28 టేబుళ్ల కేటాయించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ పూర్తి చేసి నియోజకవర్గాల్లోని పోలింగ్‌బూత్‌ల సంఖ్య ఆధారంగా రౌండ్లు నిర్దేశించి లెక్కింపు నిర్వహించారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో పాటు నలుగురు రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు, ఇతర అధికారులు ఉన్నారు.

- ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా టీడీపీ నుంచి పుట్టా మహేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నుంచి కారుమూరి సునీల్‌కుమార్ పోటీపడ్డారు. మొత్తం 13,66,844 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి 1,78,326 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా బడేటి రాధాకృష్ణ (చంటి), వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆళ్ల నాని బరిలో నిలిచారు. టీడీపీ అభ్యర్థి బడేటి చంటి 62,388 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా సొంగా రోషన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కంభం విజయరాజు పోటీలో నిలిచారు. టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ 27,766 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- కైకలూరు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు బరిలో నిలిచారు. బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ 45,273 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- నూజివీడు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా కొలుసు పార్థసారథి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పోటీ చేశారు. టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి 12,378 ఓట్లతో గెలుపొందారు.
- ఉంగుటూరు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పుప్పాల వాసుబాబులు పోటీ చేశారు. జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు 44,945 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.
- దెందులూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా చింతమనేని ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కొఠారు అబ్బయ్యచౌదరి పోటీ చేశారు. టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ 26,266 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.
- పోలవరం నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా చిర్రి బాలరాజు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తెల్లం రాజ్యలక్ష్మి పోటీ చేశారు. జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు 7,935 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

పోలవరంలో హోరాహోరీ

పోలవరం నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియ హోరాహోరీగా సాగింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి మొదటి రౌండ్ నుంచి 15వ రౌండ్ వరకు 3 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంలో కొనసాగారు. 15 రౌండ్ల పాటు పూర్తిస్థాయిలో ఆధిపత్యం చూపారు. తర్వాత 6 రౌండ్లల్లో జనసేన అభ్యర్థి పుంజుకోవడంతో ఆయనకు విజయం లభించింది. నూజివీడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కూడా గట్టి పోటీ ఇచ్చారు. మొదటి ఆరు రౌండ్లల్లో ఆధిక్యంలో కొనసాగారు.

క్లుప్తంగా

కర్ఫ్యూను తలపించిన గూడెం



కౌంటింగ్‌ను పురస్కరించుకొని గూడెంలో కర్ఫ్యూ వాతావరణం

పెంటపాడు: ఎన్నికల కౌంటింగ్ పురస్కరించుకొని పోలీసులు, ఎన్నికల అధికారుల ఆంక్షల వల్ల నిత్యం రద్దీగా ఉండే గూడెం, పెంటపాడు పలు ప్రాంతాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కర్ఫ్యూ తలపించింది. గూడెం పోలీస్ ఐలాండ్, తణుకు, భీమవరం రోడ్డు, ఏలూరు రోడ్డులోని బస్టాండ్ ప్రాంతాల్లో జనసంచారం లేక వెలవెలపోయాయి. ఒకపక్క మంగళవారం మార్కెట్ సెలవు ఉంటే మరో పక్క కౌంటింగ్ వల్ల గూడెం ప్రాంతం వెలవెలబోయింది.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు



కొయ్యలగూడెం బస్టాండ్‌లో ప్రయాణానికి అవస్థలు పడుతున్న ప్రయాణికులు

కొయ్యలగూడెం: సకాలంలో ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఆదివారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఈసీ ప్రత్యేక ఆంక్షలు విధించింది. ఇదే సాకుగా అధికారులు బస్సులను పూర్తిస్థాయిలో నడపకపోవడం ప్రయాణికుల అవస్థ పడ్డారు. సుమారు ముప్పైకి పైగా బస్సులను పలు డిపోలలో నిలిపివేయడంతో పాటుగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కూడా నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థ పడ్డారు.

తూడు తొలగించండి

దెందులూరు: వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్న తరుణంలో కృష్ణా- గోదావరి కాల్వల్లో తూడు పేరుకుపోయింది. తూడు తొలగించకపోతే సాగునీరు సరఫరాకు రైతులు ఇబ్బందులు తప్పవని సంబంధిత శాఖల అధికారులు తూడును తొలగించి సాగు నీరు సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేత్రపర్వంగా మద్ది అంజన్న తెప్పోత్సవం

మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హంస వాహనంపై స్వామి వారి తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. ముందుగా మేళ తాళాలతో స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకి సేవతో పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై స్వామి ప్రతిమను ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు పాల్గొన్నారు.

– జంగారెడ్డిగూడెం రూరల్



మద్దిక్షేత్రంలోని పుష్కరిణిలో స్వామి తెప్పోత్సవం



తెప్పోత్సవంలో కొలువైన స్వామి వారు

చెరువులో మునిగి యువకుడి మృతి



జగన్నాథపురం చెరువులో పడి మృతి చెందిన రాకేష్(20)

తాడేపల్లిగూడెం రూరల్: చెరువులో స్నానానికి దిగి ఊపిరాడక యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని జగన్నాథపురంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పంచాయతీ చెరువులో చేపలు పట్టేందుకు పెంటపాడుకు చెందిన 15మంది వచ్చారు. చేపలు పట్టిన తర్వాత రాకేష్ (20) యువకుడు తన స్నేహితులతో కలిసి చెరువులో స్నానానికి దిగాడు. ఊపిరాడక మునిగిపోయి మృతి చెందాడు. ఈ మేరకు రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మృతుడి మేనమామ చుక్కా శివకృష్ణ పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు



జంగారెడ్డిగూడెం బోసుబొమ్మ సెంటర్‌లో పోలీస్ పికెట్ దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రజాశాంతికి భంగం కలిస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా డివిజన్ పరిధిలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, డివిజన్ పరిధిలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాలు అనంతరం గెలుపు ర్యాలీలకు అనుమతులు లేవన్నారు. బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. ఎవరైనా అల్లర్లు, హింసాత్మక ఘటనలు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. మరో వారం పదిరోజులు 144 సెక్షన్, పోలీసు యాక్ట్ 30 అమలులో ఉంటుందన్నారు. డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి మండలంలో మొబైల్‌పార్టీలు, ప్రధాన గ్రామాల్లో పికెట్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. మంగళవారం జంగారెడ్డిగూడెం ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్‌ను సీఐ పి.రాజేష్, ఎస్సై జ్యోతిబస్‌తో కలిసి పరిశీలించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మద్ది అంజన్నకు చక్రస్నానం

- వేద మంత్రాలతో మహాపూర్ణాహుతి
- ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి, చక్రస్నానం, స్వామికి అభిషేకాలు వంటి కార్యక్రమాలు అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆదాయం రూ.1,35,110 వచ్చినట్లు, 1,000 మంది భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. జంగారెడ్డిగూడెంకు చెందిన బృందంచే భక్తి గీతాలాపన నిర్వహించారు. మంగళవారంతో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.



స్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయ ప్రాంగణంలో మహాపూర్ణాహుతి హోమం



స్వామి వారి క్షేత్రంలో 108 ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఎండల్లో హాయ్.. హాయ్!



నరసాపురంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు

నరసాపురం రూరల్: ఓ పక్క ఎండలు మండిపోతున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చిన్నారులు ఈత కొడుతూ భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందుతూ ఈతను ఆస్వాదిస్తున్నారు. దేహదారుఢ్యంతో పాటు శారీరక, మానసిక ఉల్లాసానికి ఈత ఎంతో మేలు చేకూరుస్తుందని వైద్యులు, వ్యాయామ నిపుణులు చెబుతున్నారు. నరసాపురం పట్టణంలో ఉన్న ఓ స్విమ్మింగ్ సెంటర్‌లో ఈత నేర్చుకోవాలనే ఆసక్తి కలిగిన చిన్నారులు కొలనులో సేదతీరుతున్నారు. ఈత నేర్చుకునేందుకు తప్పనిసరిగా హెయిర్‌క్యాప్, స్విమ్మింగ్ సూట్, వంటివి కచ్చితంగా వినియోగించాలని తద్వారా ఎక్కువ సేపు జలకాలాడినా తల, కళ్లు, చెవులకు ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయని స్విమ్మింగ్‌పూల్ నిర్వాహకుడు సుంకర రమేష్ పేర్కొన్నారు.

కళకళలాడుతున్న కాటన్ పార్కు

రూ 1.14 కోట్లతో పార్కు అభివృద్ధి



పర్యాటకులతో కళకళలాడుతున్న కాటన్ పార్కు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న కాటన్ పార్కు పర్యాటకులతో కళకళలాడుతోంది. పార్కును రూ1.14 కోట్లతో గత ఏడాది అభివృద్ధి చేశారు. దీంతో పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. వేసవి దృష్ట్యా వారాంతరాలు, సెలవు దినాల్లో పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ముఖ్యంగా పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ ఆకట్టుకుంటోంది. దీంతో రాత్రిపూట పర్యాటకుల సంఖ్య పెరిగింది. పట్టణంలో రెండు ప్రధాన పార్కులున్నాయి. ఇందులో ఒకటి కాటన్‌పార్కు కాగా, మరొకటి శారదా థియేటర్ వద్ద బాలయ్య పార్కు. కాటన్‌పార్కు శిథిలమై దాదాపు మూతపడే స్థితికి వచ్చింది. దీంతో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టి పెట్టి పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ప్రణాళికా అభివృద్ధి సంఘం నిధులు కేటాయించారు. మున్సిపాలిటీ కూడా కొంతమేర జనరల్ ఫండ్స్ కేటాయించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.

గుర్తుతెలియని జంతువు దాడిలో దూడ మృతి



గుర్తు తెలియని జంతువు దాడిలో మృతి చెందిన దూడ

చింతలపూడి: చింతలపూడి మండలం కంచనగూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని జంతువు దాడిలో లేగ దూడ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం అడవిలో లేగ దూడ మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు పులి దాడిలోనే చనిపోయిఉండొచ్చని ఆందోళన చెందుతున్నారు. జంతువు దాడిలో చనిపోయిన దూడ గ్రామానికి చెందిన పి.నాగేశ్వరరావుదని తెలిపారు. గత నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు అడుగు జాడలను గుర్తించడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీ అధికారులకు సమాచారం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

మార్టేరు పరిశోధన సంస్థలో విత్తనాల విక్రయం

పెనుమంట్ర: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జూన్ 5, 6, 7 తేదీల్లో రైతులకు విత్తనాల విక్రయం చేస్తారని మార్టేరు వ్యవసాయ సంస్థ ఏడీఆర్ డాక్టర్ డి.శ్రీనివాస్, శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన సంస్థలో పడిపోని స్వర్ణగా పేరొందిన ఎంటీయు 1318(ఫౌండేషన్, సత్య ప్రమాణ విత్తనాలు) 1,500 క్వింటాళ్ల విత్తనాలు ఉన్నాయని, ఎవరికైనా కావాలంటే వారి అవసరం మేరకు సరఫరా చేస్తామని వారు తెలిపారు. అదేవిధంగా ఎంటీయు 1318 (ఫౌండేషన్ విత్తనం) 25 కేజీల బస్తా ధర రూ.1000, ఎంటీయు 1318 (సత్య ప్రమాణ విత్తనం) 25 కేజీల బస్తా ధర రూ.950 విక్రయించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని స్వర్ణకు ప్రత్యామ్నాయంగా పడిపోని 150 రోజుల కాలపరిమితి కలిగి, తక్కువ నత్రజనితో స్వర్ణ కన్నా 10 శాతం అధిక దిగుబడి, మిల్లర్లకు, మార్కెట్‌కు అనువైన ఎంటీయు 1318 రకాన్ని సాగు చేయాలని, మంచి దిగుబడులు పొందాలని సూచించారు.

గ్రామాల్లో పశుగ్రాసం కొరత



గడ్డిని ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: రోజురోజుకు పెరుగుతున్న ఎండలు, వర్షాభావంతో కొంతకాలంగా గ్రామాల్లో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీనికితోడు దాళ్వా సాగులో కోతలకు ఈ ప్రాంతంలో గత కొంత కాలంగా యంత్రాలను వినియోగించడంతో పశువులకు గడ్డి దక్కడం లేదు. యంత్రాలతో కోతల వల్ల గడ్డి చిన్నచిన్న ముక్కలుగా మారడంతో పశువులకు ఎండు గడ్డి కొరత ఏర్పడుతుంది. దీంతో మూగ జీవుల పొట్ట నింపడం కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని సుమారు 50 వేల వరకు పశువులు ఉన్నాయి. వీటిని పోషించేందుకు గతంలో రైతులకు గడ్డి సమృద్ధిగానే దొరికేది. ప్రస్తుతం పంట పొలాలు లేఅవుట్లుగా మారడంతో కొంత మేర సాగు విస్తీర్ణం తగ్గగా.. ఎండుగడ్డి పూర్తిస్థాయిలో కొరత ఏర్పడింది. ఎండుగడ్డి వినియోగంపై సరైన అవగాహన లేక వరికోత మిషన్లను వినియోగించడం ద్వారా కూలీ ఖర్చులు తగ్గడం, తక్కువ సమయంలో ధాన్యం ఒబ్బిడి కావడం వంటి వాటిపైనే దృష్టి సారించడంతో ఈ కొరత మరింత ఎక్కువైంది. దీంతో పశుగ్రాసం కొరతతో పోషించే స్తోమత లేక పలువురు అయినకాడికి విక్రయిస్తున్నారు. ఒక వైపు వ్యాధులు ప్రబలడం, మరోవైపు పశుగ్రాసం కొరత వెరసి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పెంపకందారులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. గతంలో సార్వా పంటకాలంలో ఎకరం గడ్డి రూ.2 వేలకు విక్రయించేవారు. దీనిని ఒబ్బిడి చేసి ఇంటికి లేదా పశువుల శాలకు చేరవేసేందుకు అదనంగా మరో రూ.2 వేల వరకు ఖర్చయ్యేది. ప్రస్తుతం గడ్డి ఓ వ్యాపారంగా మారడంతో ట్రాక్టర్ ట్రక్కు ఒక్కింటికి (సుమారు ఎకరంన్నర)గడ్డి కొనుగోలు చేసి పశువుల శాలకు చేరేసేందుకు రూ.9 వేల వరకు ఖర్చవుతుంది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ఈ గడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం వరకు ఎకరం ఎండు గడ్డి రూ. 3 వేలు ఉండేదని, ప్రస్తుతం ఎనిమిది, తొమ్మిది వేల వరకు ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

శరవేగంగా గుండుగొలను వంతెన నిర్మాణం



గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మిస్తున్న వంతెన

భీమడోలు: జాతీయ రహదారి గుండుగొలను వద్ద గల గోదావరి కాలువపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు రూ.4.2 కోట్ల నిధులతో చేపట్టిన భారీ వంతెన నిర్మాణం చురుగ్గా సాగుతోంది. బ్రిటిష్ కాలం నాటి ఈ వంతెన రెండేళ్ల కితం శిథిలావస్థకు చేరి కూలింది. దీనితో ఈ వంతెనపై రాకపోకలు సాగించే భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, కైకలూరు తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలాది ఎకరాల్లో ఆక్వా రంగం విస్తరించిన నేపథ్యంలో ఈ ప్రాంతాలకు అవసరమైన చేపల మేత దిగుమతులు, చేపల ఎగుమతుల రాకపోకలకు ఆక్వా యాజమానులు నానా ఇక్కట్లను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రత్యేక కృషితో రూ.4.2 కోట్ల నిధులను మంజూరు చేశారు. వంతెన నిర్మాణ పనులకు సుమారు ఏడాది కితం శంకుస్థాపన చేశారు. గోదావరి కాలువపై ఈ వంతెన నిర్మాణంలో పిల్లర్లు నిర్మించే తరుణంలో కింద గోదావరి నీరు ప్రవహిస్తుండడంతో పనులకు తీవ్ర అడ్డంకి ఏర్పడింది. ఈ వంతెన నిర్మాణ పనుల కంటే గోదావరి ఆయకట్టుపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు నీటిని అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పనులకు మందగొడిగా సాగుతున్నాయి. గత నెలలో కాలువకు సాగునీరు నిలిపివేయడంతో వంతెన నిర్మాణ పనులు జోరుగా సాగాయి. దీనితో వంతెనకు ఆయువుగా ఉన్న రెండు ఫిల్లర్లు వేశారు. దీనితో పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. ఇప్పటికే పనులు పూర్తి కావస్తుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

జలక్రీడల్లో శిక్షణ

జంగారెడ్డిగూడెం రూరల్: జలక్రీడల్లో శిక్షణ పొంది రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు జిల్లా క్రీడాకారులు. జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కెకెఎం ఎర్రకాలువ జలాశయంలో వీరికి శిక్షణ ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్ విభాగాల్లో ఆసక్తి కలిగిన వారికి శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం వేసవి శిక్షణ శిబిరంలో 40 మందికి రోయింగ్, కయాకింగ్, కనోయింగ్ జలక్రీడల్లో శిక్షణ పొందుతున్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కోచ్ కృష్ణమూర్తి, రాజేష్‌లు శిక్షణ అందిస్తున్నారు. వేసవి శిక్షణ అనంతరం సంవత్సరంలో 365 రోజుల పాటు జలక్రీడల్లో శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఎర్రకాలువ జలాశయంలో 2018లో రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో జల క్రీడలు ప్రారంభించి ఉచితంగా శిక్షణ అందిస్తూ వస్తున్నారు. ఇప్పటి వరకు జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్ విభాగాల్లో 200 మంది పైగా శిక్షణ పొంది జాతీయ స్థాయిలో 40 మంది, రాష్ట్ర స్థాయిలో 50 మంది జలక్రీడల్లో పతకాలు సాధించినట్లు కోచ్ కృష్ణమూర్తి తెలిపారు.

3 విభాగాల్లో శిక్షణ

వాటర్‌స్పోర్ట్(జలక్రీడలు)ల్లో శిక్షణ పొందే వారికి 3 విభాగాల్లో శిక్షణ అందిస్తుంటారు. కయాకింగ్(రెండు బ్లేడులతో ఉన్న ఫెడల్ బోటు నడపడం), కనోయింగ్ (మోకాళ్లతో ఫెడలింగ్ చేస్తూ బోటు నడపడం, రోయింగ్ వంటి విభాగాల్లో ఇక్కడ శిక్షణ ఇస్తారు.



ఎర్రకాలువ జలాశయంలో జలక్రీడల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులు



వ్యాయామం చేస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

గ్రంథాలయంలో పుస్తక పఠనం


వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): విద్యార్థినీ, విద్యార్థులు చదివిన చదువును గుర్తించుకోవాలని పలువురు రిసోర్స్‌పర్సన్‌లు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరం గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావుచే నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎస్.సత్యం, ప్రత్తి వీరాస్వామి, వి.రామాంజనేయులు, గరికపాటి బాపయ్య శర్మ, పాండు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, లెక్కలలో టిప్స్, పొడుపు కథలు, తదితర విషయాలను నేర్పించారు. యోగా క్లాసులు, ఆధ్యాత్మిక విషయాలు, ఆట పాటలు నిర్వహించారు.

వైభవోపేతంగా మహానంది అభిషేకం


మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో మహానందికి అభిషేకం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: మహానందికి అభిషేకాలు మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. స్థానిక మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలోనూ, జవహర్‌పేటలోని రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో నందికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ పండ్ల రసాలు, ఆవుపాలు, పెరుగు, నెయ్యి, పసుపు, కుంకుమ, కొబ్బరి నీళ్లతో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు లంక దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కార్యదర్శి కాకర్ల రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. వైశాఖ మాసం బహుళ త్రయోదశి రోజు నందీశ్వరుడికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజని, అమావాస్య ముందు రోజు వచ్చే త్రయోదశికి అభిషేకాలు చేస్తే పాపాలు హరించి, పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నట్లు దుర్గాప్రసాద్ వివరించారు. కార్యక్రమాలలో పలువురు భక్తులు స్వయంగా అభిషేకంలో పాల్గొన్నారు.

బడి తెరిచిన రోజే విద్యాసామగ్రి

పెనుగొండ: నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ ఏర్పడింది. దీనికి తోడు గతానికి భిన్నంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలల వేసవి సెలవులు ముగిసి పునః ప్రారంభానికి ముందే జేవీకే కిట్లు సిద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం మండలంలోని అన్ని పాఠశాలలకు జేవీకే కిట్లు సమకూర్చారు. తొలి విడతగా 1014 మంది చిన్నారులకు షూలు, షాక్స్, 2429 మందికి బెల్ట్‌లు, పాఠ్య పుస్తకాలు 20531, సిద్ధం చేశారు. దీంతో పాటు విద్యార్థులకు ప్రాక్టికల్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు, యూనిఫాంలు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రెండో దశలో విద్యార్థులకు వీటిని సమకూర్చడానికి పాఠశాలలు తెరిచిన రోజే అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

చేరికలు పెంచేందుకు విస్తృత ప్రచారం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పించడానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఫ్లెక్సీలు వ్రేలాడ దీయడం, సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ద్వారా విద్యార్థుల సంఖ్యల పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఎప్రభుత్వ పాఠశాలలు మా ప్రత్యేకతలు ఇవే అంటూ ప్రచారం చేసుకునే స్థాయికి చేరుకొన్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో సాధించిన మార్కులు ప్రకటించడంతో పాటు, ఫీజులు భారం లేని ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత మెటీరియల్, మధ్యాహ్నం రుచికరమైన భోజన సదుపాయం, ఇతర ప్రభుత్వ రాయితీలు, వసతలు, కార్పొరేటుకు ధీటుగా మౌలిక సదుపాయాలు అంటూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలలకు పోటీగా ప్రచారం చేస్తూ విద్యార్థులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు.

పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక టీకాలు

యలమంచిలి: గ్రామాల్లో పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక టీకాలు ముమ్మరంగా చేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. శిరగాలపల్లి, బూరుగుపల్లి గ్రామాలలో మంగళవారం పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక టీకా, గొర్రెలకు చిటుక వ్యాధి నిరోధక ఎంటరో టాక్సీమియా (ఈటీ) వ్యాక్సిన్ వేసినట్లు ఆయన వివరించారు. ఇంత వరకు 1200 పశువులకు, 900 గొర్రెలకు ఈ రెండు రకాల టీకాలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం అడవిపాలెం, గుంపర్రు, కాంభొట్లపాలెం, ఇలపకుర్రు, అబ్బిరాజుపాలెం, బాడవ గ్రామాల పశు సంవర్ధక సహాయకుల సహాయంతో చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

తణుకు ఆస్పత్రిలో ఇక డిజిటల్ ఎక్సరేలు..

- అందుబాటులోకి వచ్చిన డిజిటల్ ఎక్సరే మిషన్స్
- 5 నిముషాల్లో ఎక్సరే డిజిటల్ ప్రింట్
- సత్వరమే వైద్యుడికి వద్దకు వెళ్లే పరిస్థితి
- నెలకు 2వేలకు పైగా ఎక్సరేలు..


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డిజిటల్ ఎక్సరే మిషన్ ప్రారంభిస్తున్న డాక్టర్ అరుణ (ఫైల్)



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చిన డిజిటల్ ఎక్సరే మిషన్

తణుకు అర్బన్ : తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి డిజిటల్ ఎక్సరే పరికరాలు అందుబాటులోకి రావడంతో ఆ విభాగ సేవలు మరింత విస్తృతం కానున్నాయి. ఇప్పటివరకు మాన్యువల్ పద్ధతిలో ఎక్సరే మిషనల్ ద్వారా ఎక్సరేలు తీసి వైద్యుడికి పంపించే సౌకర్యం మాత్రమే అమల్లో ఉంది. రెండు నెలల క్రితమే ఆస్పత్రికి 300 ఎంఏ, 500 ఎంఏ అధునాతన డిజిటల్ ఎక్సరే పరికరాలు అందుబాటులోకి రాగా ఈనెల 1వ తేదీన సంబంధిత టెక్నీషియన్స్ పరికరాలను అమర్చడంతో ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ మిషన్స్‌ను ప్రారంభించి వాటి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ఆస్పత్రిలో ఎక్సరే రిపోర్టులు సత్వరమే అందుతున్నాయి.

ఆర్థో విభాగంలో ఎక్సరే పరికరాలు కీలకం...

ఆస్పత్రిలోని ఆర్థో పెడిక్ విభాగంలో ఈ డిజిటల్ ఎక్సరే పరికరాలు కీలక పాత్ర పోషిస్తుంటాయి. నడుము, వెన్ను, మెడనొప్పి వంటి రోగులతోపాటు ప్రమాదాల్లో గాయపడి ఎముక చిట్లిందో, విరిగిందో తెలిపే ఎక్సరే విభాగానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే ఇప్పటివరకు ఎక్సరేలు మాన్యువల్ పద్ధతిలో కూడా తణుకు ఆస్పత్రిలో సత్వర వైద్యసేవలు అందుతున్నప్పటికీ డిజిటల్‌విధానంలో రోగులకు 5 నిముషాల వ్యవధిలోనే ఎక్సరేలు తీయడం సంబంధిత వైద్యుడికి డిజిటల్ విధానంలో పంపించే వెసులుబాటు నేడు వచ్చింది. ఈ ఎక్సరేద్వారా ఎముకల పరిస్థితి తెలుసుకుని వెంటనే సదరు ఆర్థో వైద్యులు శస్త్రచికిత్సలు, మందులు వాడించడం ద్వారా రోగికి నేరుగా అత్యంత సత్వరమే సేవలు అందించే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎక్సరేని తీసి ఆ సీడీని మిషన్‌లో పెట్టి సదరు ఫిల్మ్‌ను డిజిటల్ విధానంలోనే వైద్యులకు ఇచ్చే పరిస్థితి ఉండగా, నేడు అందుబాటులోకి వచ్చిన డిజిటల్ ఎక్సరే పరికరాల ద్వారా ఎక్సరే తీసి నేరుగా (మొబైల్‌లో ఫొటో తీసి పంపించిన విధంగా) వైద్యుడి మొబైల్‌కు పంపించే సౌకర్యం కలిగింది. ఆర్థోతోపాటు జనరల్ మెడిసిన్ విభాగంలో సైతం దగ్గు, జలుబు, ఛాతీ నొప్పి వంటి ఇబ్బందులతో వచ్చే రోగులకు కూడా చెస్ట్ ఎక్సరేలు కూడా తీయాల్సి ఉంటుంది.

నెలలో 2వేలకు పైగా ఎక్సరేలు

తణుకు అర్బన్ : ఆర్థో, జనరల్ మెడిసిన్ విభాగాలకు సంబంధించి ప్రస్తుతం నెలలో 2వేలకు పైగా ఎక్సరేలు తీస్తుండగా ఇకపై ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. తణుకు నియోజకవర్గంతోపాటు తణుకు పరిసర ప్రాంత 100 గ్రామాల నుంచి నిత్యంఆస్పత్రికి 500 నుంచి 600 వరకు వివిధ ఇబ్బందులతో అవుట్ పేషెంట్స్ వస్తుండగా, జాతీయ రహదారి తణుకు రూరల్, పట్టణ ప్రాంతానికి చేర్చి ఉండడంతో నిత్యం వివిధ ప్రమాదాల్లో గాయపడడం ద్వారా వైద్యసేవలకోసం ఆస్పత్రికి వస్తున్నారు. వీరందరికీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఇద్దరు ఆర్థోపెడిక్ వైద్యులతోపాటు రేడియో గ్రాఫర్, అసిస్టెంట్స్ ద్వారా వైద్యసేవలు వేగంగా అందుతున్నాయి. ఆస్ప త్రికి అధునాతన పరికరాలు అందుబాటులోకి రావడంతో తణుకుతోపాటు పరిసర ప్రాంతా ల ప్రజానీకం కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


యాగర్లపల్లిలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీటీసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణ రావు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమం, ర్యాలీ మంగళవారం యాగర్లపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ తనూజ అధ్యక్షతన నిర్వహించారు. వీకర్స్‌కాలనీ, బేబి సెంటర్, కడకట్ల పరిధిలోని వైద్యాధికారులు డాక్టర్.శ్రావ్య, డాక్టర్ అనీషా, ఆశాలు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు హాజరైయారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మలేరియా ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఎక్కువకాలం నీటి నిల్వ ఉన్న ప్రదేశాలలో సంతానోత్పత్తి చేస్తుందని, సంక్రమణ వ్యాధులలో అతి ముఖ్యమైనదని చెప్పారు. వ్యాధులు వ్యాప్తి చెందుకుండా ఉండేందుకు నియంత్రన చర్యలు ఫాగింగ్, స్ప్రేయింగ్, లార్వా జనిత ప్రదేశాలలో గుంబూషియ ఫిష్ రిలీజ్ చేయాలని పలు సూచనలు చేశారు. మలేరియా వ్యాధిని సమాజం నుంచి తరిమి వేయాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు జి.పద్మ, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఎన్.శ్యామ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో గెలుపు ఆరిమిల్లిదే


తణుకు ఆర్‌ఓ బీవీ రమణ చేతుల మీదుగా ధ్రువపత్రం అందుకుంటున్న తణుకు ఎమ్మెల్యేగా గెలిచిన ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు: తణుకు నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన ఆరిమిల్లి రాధాకృష్ణ 72,121 ఓట్లు ఆధిక్యంతో గెలుపొందారు. వైఎస్సార్ సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కారుమూరి వెంకటనాగేశ్వరరావుపై ఆయన విజయం సాధించారు. తణుకు నియోజకవర్గంలో మొత్తం 1,92,564 ఓట్లకు గాను మంగళవారం కౌంటింగ్ నిర్వహించారు. తణుకు నియోజకవర్గానికి సంబంధించి భీమవరం విష్ణు కళాశాలలో కౌంటింగ్ చేపట్టారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రక్రియతో ప్రారంభించగా 8.30 గంటలకు ఈవీఎంలలో ఓట్లు లెక్కించారు. తణుకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కూటమి అభ్యర్థి బొలిశెట్టిదే విజయం


గూడెం ఆర్‌ఓ కె.చెన్నయ్య చేతుల మీదుగా ధ్రువపత్రం అందుకుంటున్న గూడెం ఎమ్మెల్యేగా గెలిచిన బొలిశెట్టి శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: గూడెం నియోజకవర్గ ఓటర్లు విభిన్నంగా తీర్పు నిచ్చారు. విజేతగా జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాసు తన సమీప ప్రత్యర్థి కొట్టు సత్యనారాయణపై 61,510 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కొట్టు సత్యనారాయణకు 53,445 ఓట్లు రాగా, బొలిశెట్టి శ్రీనివాసుకు 1,14,955 ఓట్లు వచ్చాయి. 61,510 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి మార్నీడి బాబ్జీకి 1868 ఓట్లు పడ్డాయి. పీఎస్‌ఆర్ కృష్ణకు 913, బుసనబోయిన ఆంజనేయులుకు 502, నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బొలిశెట్టి శ్రీనివాసరావు749, మరపట్ల రాజుకు 739,మేకా వెంకటేశ్వరరావుకు 201, ఉంగరాల పద్మకు 253, నడపన అచ్యుతకుమార్‌కు 157ఓట్లు, బి.రాజేష్‌కు 263, లంకా ప్రసాద్‌కు 183, సరివరపు సింహాచలంకు 238 ఓట్లు పడ్డాయి. నోటాకు 1,522 ఓట్లు వచ్చాయి. విజేత బొలిశెట్టికి ఆర్‌ఓ కె.చెన్నయ్య విజయం సాధించినందుకు ధ్రువపత్రాన్ని అందజేశారు. బొలిశెట్టి వర్గీయులు సంబరాలు చేసుకున్నారు.

నేడు ఐరిష్ ఫ్లోరెట్స్ స్కూల్ ప్రారంభోత్సవం

తాడేపల్లిగూడెం (టీటీసీ): హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఐరిష్ ఫ్లోరెట్స్ హ్యాపీ స్కూల్ ను ఈ నెల 5వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకు తాడేపల్లిగూడెం హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఎంవీఆర్ ఉన్నత పాఠశాల క్యాంపస్‌లో ప్రారంభిస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వ్యక్తిత్వ వికాస నిపుణులు, నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్, తాడేపల్లిగూడెం డీఎస్పీ డీఎస్‌ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, ఐరిష్ ఫ్లోరెట్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తుర్లపాటి శిరీష్ పాల్గొంటారని వెల్లడించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు.

పోలీస్ హై అలర్ట్!

- అల్లర్లపై 'పోలీస్ ఫోకస్'
- ముందస్తు చర్యలతో కట్టడి
- కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పహారా
- తణుకులో కర్ఫ్యూను తలపించిన రోడ్లు


తణుకులో నిర్మానుష్యంగా వెంకటేశ్వర థియేటర్ సెంటర్

తణుకు: శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసు శాఖ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం హై అలర్ట్ ప్రకటించింది. మరో వారం రోజుల పాటు శాంతి భద్రతల పరిరక్షణ అత్యంత కీలకంగా ఆ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసు శాఖను అప్రమత్తం చేస్తూ ఇప్పటికే ఉన్నతాధికారులు సమీక్షలు చేశారు. ఓట్ల లెక్కింపు ముందు రోజు నుంచే నిర్వహించాల్సిన విధి విధానాలపై క్షేత్రస్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిని వెతికిపట్టి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చారు. ఎన్ని కల ప్రకటన వెలువడిన మార్చి 16 నుంచి ప్రవర్తన నియమావళి అమలులో ఉంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో నిబంధనలు పక్కాగా అమలుపై పోలీసు శాఖ శ్రమిస్తోంది. ఓట్ల లెక్కింపు రోజు మంగళవారం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధకారులు చర్యలు చేపట్టారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

అప్రమత్తంగా అధికారులు...

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి రౌడీషీటర్లపై పోలీసులు ఫోకస్ పెట్టారు. రౌడీషీట్లు, అనుమానితులతో పాటు ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉన్నవారికి గట్టిగానే కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లతో పాటు నేర ప్రవర్తన ఉన్న సుమారు 150 మందికి పైగా బైం డోవర్ చేశారు. అయినా ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. 144 సెక్షన్‌తోపాటు పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉన్నందున ముందస్తు అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించడానికి వీలు లేకుండా చర్యలు తీసుకున్నారు. విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా వినియోగంపై నిషేధం విధించారు.

నిర్మానుష్యంగా రోడ్లు...

ఓట్ల లెక్కింపు రోజు మంగళవారం తణుకు నియోజకవర్గంలో ఎలాంటి ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గెలిచిన అభ్యర్థులు, వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, డీజేలతో సంబరాలు నిర్వహించరాదని ముందుగానే తేల్చిచెప్పారు. కౌంటింగ్ ప్రశాంతంగా పూర్తి చేసేందుకు పోలీసు ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. బాణసంచా విక్రయాలు, బాటిళ్లలో పెట్రోల్ అమ్మకాలను రద్దు చేశారు. కౌంటింగ్ ముందు రోజు నుంచే మద్యం అమ్మకాలను నియంత్రించే చర్యలకు ఆదేశించారు. తణుకు నియోజకవర్గానికి ప్రత్యేకంగా నియమించిన ప్రత్యేక ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో తణుకు పట్టణ, రూరల్ సీఐలు నాగరాజు, నాగేశ్వరరావులు నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు. దీంతో తణుకు పట్టణంలోని రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

అవగాహన కార్యక్రమాలతో అప్రమత్తం...

ప్రశాంత కౌంటింగ్ లక్ష్యంగా పోలీసు శాఖ ఇప్పటికే వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. జిల్లా అంతటా సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ పాటు కార్డన్ సెర్చ్‌లు నిర్వహించింది. ఎన్నికల ఫలితాలపై అల్లరి మూకల ఆందోళనలను కట్టడి చేసే దృశ్యాలను డెమో ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా ప్రదర్శించారు. ఆందోళనలు నిర్వహిస్తే అడ్డుకోవడం నుంచి బాష్పవాయువు ప్రయోగం, గాలిలోకి కాల్పులు, లాఠీ చార్జి, ఫైరింగ్ వంటి పోలీస్ చర్యలు, గొడవలు, విద్వేషాలు, అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఎలాంటి చర్యలు ఉంటాయో ప్రదర్శనలు రూపంలో చూపారు. ఓటర్ల తీర్పు వెల్లడయ్యే సమయం దగ్గర పడిన తరుణంలో మునుపెన్నడూ లేని విధంగా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అవాంఛ నీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

వేసవి శిక్షణ శిబిరంతో సృజనాత్మక శక్తి

ఆకివీడు: వేసవి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులలో ఉత్సాహాన్ని, ఆలోచనా శక్తితో పాటు సృజనాత్మకత పెంపొందిస్తాయని గ్రంథాలయ పాలకురాలు పార్వతి అన్నారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో నెల రోజులుగా వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం క్రికెట్, పేపర్ పువ్వుల తయారీలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే విధంగా పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, వక్తలు ఇచ్చిన తర్ఫీదులో విద్యార్థులు నూతన విషయాలు నేర్చుకున్నారన్నారు. వేసవి శిక్షణ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తుందన్నారు. పఠనా శక్తిని వృద్ధి చేస్తుందన్నారు. గ్రంథాలయంలోని విలువైన పుస్తకాల్ని చదివితే విద్యార్థులకు ప్రముఖుల జీవిత చరిత్ర స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని తెలిపారు.


వేసవి శిక్షణలో క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

భీమవరంలో వేసవి శిక్షణ శిబిరం

భీమవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞా న శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్యార మ్స్ చెస్ క్రీడ ల్లో శిక్షణ ఇచ్చి పుస్తక పఠనం చేయించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ జి.విజయ్‌కుమార్ గణిత పజిల్స్‌పై విద్యార్థులకు పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో షేక్ అబ్దుల్ లియాకత్ ప్రథమ స్థానంలోను, బి.భార్గవి ద్వితీయ స్థానంలో నిలిచి, నగదు బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, డ్యాన్స్ మాస్టర్ జి.శ్యామ్, జె.గంగాధర్, సోమరాజు, పుష్ప, వివివిఎస్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


క్యారమ్స్, చెస్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సుందరంగా ఆర్వోబీ, డివైడర్స్

- రంగులతో ముస్తాబు
- మొక్కలతో పచ్చదనం


తణుకు రాష్ట్రపతి రోడ్డులో రంగులతో సుందరంగా తీర్చిదిద్దిన డివైడర్స్

తణుకు అర్బన్: తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ఆర్వోబీ, డివైడర్స్ సుందరంగా తీర్చిదిద్దారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మునిసిపల్ నిధులతో ఆర్వోబీని, డివైడర్స్ రంగులతో తీర్చిదిద్దడమే కాకుండా ఆర్వోబీపై మొక్కల కుండీలు ఏర్పాటుచేసి మొక్కలు వేయగా, డివైడర్స్‌లో సైతం ఆహ్లాదాన్ని పంచే మొక్కలు వేయడంతో ప్రయాణికులకు కనువిందు చేస్తున్నాయి. తణుకు ప్రధాన రహదారి అయిన రాష్ట్రపతి రోడ్డుపై నిత్యం పట్టణానికి చెందిన వారే కాకుండా తణుకు చుట్టుపక్కల 100 గ్రామాల నుంచి వివిధ వ్యాపార, ఉద్యోగాల నిమిత్తం లక్షలాది మంది ప్రయాణాలు చేస్తుంటారు. గతంలో నిర్వీర్యంగా ఉండే ఆర్వోబీ, డివైడర్స్‌ను సుందరంగా తయారు చేయడంతో ప్రయాణికులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మునిసిపల్ సిబ్బంది మొక్కలను సంరక్షించడమే కాకుండా ట్యాంకు ద్వారా నీరు పోస్తున్నారు.


తణుకులో రంగులతో ముస్తాబైన ఆర్వోబీ


తణుకులో రాష్ట్రపతి రోడ్డులో డివైడర్స్‌లో వేసిన మొక్కలు

చెక్కుచెదరని అభిమానం

ఆకివీడు: మండలంలోని కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడు, రాజులపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభిమానం చెక్కుచెదరలేదు. గ్రామస్తులు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీకి మెజార్టీ చేకూర్చారు. కూటమి గాలిలో కూడా ఆ రెండు గ్రామాల ప్రజలు అభిమానంతో 450, 10 ఓట్లు మెజార్టీ కల్పించారు. గత ఎన్నికల్లో కూడా ఆయా గ్రామాలు మెజార్టీ చేకూర్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో 938 ఓట్లు చినమిల్లిపాడులో పోలవ్వగా వైఎస్సార్‌సీపీకి 672 ఓట్లు వేశారు. రాజులపేటలో 447 ఓట్లు పోలవ్వగా వైఎస్సార్‌సీపీకి 210 ఓట్లు వచ్చాయి.

వేసవి శిక్షణ శిబిరం

నరసాపురం: నరసాపురం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో మంగళవారం పిల్లలకు నీతి కథలు చెప్పారు. అలాగే పిల్లలతో తెలుగు చదివించారు. తెలుగు టు ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, యోగా, చెస్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులకు మంచి స్పందన వచ్చిందన్నారు.